ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112    www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03    సంచిక -124    పేజీలు - 04    వెల - 04/-    ఆదివారం 7 జూన్ 2026


# సర్వేలు చేయిస్తున్నాం జాగ్రత్త...



## సర్వే చేస్తాం... తేడాగా ఉన్నవాళ్లను వదిలించుకుంటాం: క్యాడర్ కు చంద్రబాబు క్లారిటీ

- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన
- మద్యనిషేధ హామీని గాలి కొదిలేసిన జగన్
- సిపిఎస్ రద్దు చేస్తామని మోసం చేసిన వైసిపి
- జాబ్ క్యాలెండర్ పేరుతోనూ మోసం చేశారు
- టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో భేటీ చంద్రబాబు విమర్శలు

**అమరావతి,జూన్ 06ఆంధ్ర ప్రగతి**
తెలుగుదేశం పార్టీలో ఇకపై పనితీరే ప్రామాణికమని, తప్పులు చేసే వారిని, తేడాగా వ్యవహరించే వారిని వదిలించుకుంటానని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీ పదవుల నుంచి ఎన్నికల టిక్కెట్ల కేటాయింపు వరకు నిరంతరం సర్వేలు చేయిస్తానని, ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని ఆయన తేల్చి చెప్పారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ భవిష్యత్ వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ఇకపై పార్టీకి ఓటమి లేదు, రాదు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలతో మంచిగా ఉంటున్నాం, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నాం,**2లో...**



# కాక్రోచ్ ల ఆందోళన




## కేంద్రాన్ని నిలదీసిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే

- అంబేద్కర్ (భగత్ సింగ్ సావిత్రిబాయి పూలే ఫొటోలతో నినాదాల హోరు
- ఒక చేతిలో రాజ్యాంగం, మరో చేతిలో జాతీయ జెండా
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకూ నిరసనలు కొనసాగుతాయని వెల్లడి
- జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళన

**న్యూఢిలీజూన్ 06ఆంధ్ర ప్రగతి** నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా**మిగతా 2లో...**

# జనసేన తరపున లింగమనేని నామినేషన్

- జనసేన తరపున తొలి రాజ్యసభ సభ్యుడిగా పెద్దల సభలోకి అడుగుపెట్టనున్న లింగమనేని
- లింగమనేని సభ్యత్వాన్ని సమర్థిస్తూ సంతకాలు చేసిన కూటమి ఎమ్మెల్యేలు



**అమరావతి,జూన్ 06 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా లింగమనేని రమేష్ అసెంబ్లీలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున రాజ్యసభ రేసులోకి ఒక అభ్యర్థి అధికారికంగా ఎంట్రీ ఇవ్వనుండటం ఇదే తొలిసారి కావడం విశేషం.
ఈ నామినేషన్ ప్రక్రియ అధికార ఎన్డీఏ కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీల మధ్య ఉన్న బలమైన

# గోదావరి పుష్కరాలకు మరింత శోభ



- పంచాయతీల నుంచి మురుగు నీరు నదిలోకి కలవకూడదు
- ప్రతి పంచాయతీలోనూ ప్రత్యేక ప్రణాళిక అవసరం
- మ్యాజిక్ డ్రెయిన్లతో మంచి ఫలితాలు
- మునికూడలి పుష్కర ఘాట్ ను మోడల్ గా తీర్చిదిద్దుతాం
- మునికూడలి ఘాట్ కి సప్తర్షి పుష్కర్ ఘాట్ గా నామకరణం
- గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై సమీక్ష చేసిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్


**అమరావతి,జూన్ 06 ఆంధ్ర ప్రగతి**
'గోదావరి పుష్కరాలను స్వచ్ఛంగా, శుభ్రంగా నిర్వహించాలన్నది కూటమి ప్రభుత్వ తపన. ఇందుకు అనుగుణంగా గోదావరి పుష్కరాలకు ఆతిథ్యం ఇచ్చే 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దుతాం. పంచాయతీల నుంచి వచ్చే మురుగు నీరు చుక్క కూడా గోదావరిలోకి కలవకుండా చర్యలు తీసుకోవాలి. జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీలుగా తీర్చేదిద్దే బాధ్యతను జిల్లా కలెక్టర్లు తీసుకోవాలి. ఇందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేయాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులను ఆదేశించారు.**మిగతా 2లో...**

# తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

- ముగ్గురి పేర్లను ఖరారు చేసిన టీడీపీ నాయకత్వం
- సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లకు అవకాశం
- అభ్యర్థులను అధికారికంగా ప్రకటించిన చంద్రబాబు



**అమరావతి,జూన్ 06 ఆంధ్ర ప్రగతి**
తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తమ రాజ్యసభ అభ్యర్థులను ఖరారు చేసింది. ముగ్గురు అభ్యర్థులతో కూడిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అధికారికంగా విడుదల చేశారు. జూన్ 18న జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ తరఫున సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ బరిలో నిలవనున్నారు.**మిగతా 2లో...**



# ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

- దక్షిణ కోస్తా, రాయలసీమకు అలర్ట్
- జూన్ 4న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు
- ఏపీలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

**అమరావతి,జూన్ 06 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వాతావరణ శాఖ తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. వాతావరణ శాఖ అధికారుల సమాచారం ప్రకారం...**మిగతా 2లో...**

# ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం

## రష్యాలో మంత్రి నారా లోకేష్ కీలక భేటీలు

- సంక్షోభంలోనూ అవకాశాలు సృష్టించడమే నాయకత్వమన్న లోకేష్
- ప్రవాస భారతీయులు ఏపీ బ్రాండ్ అంబాసిడర్లుగా మారి అభివృద్ధిలో భాగం కావాలని పిలుపు
- అమరావతి, విశాఖలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కోసం యాండెక్స్ సంస్థతో కీలక చర్చలు
- టీచర్లు లేని వినూత్న 'స్కూల్ 21'ను సందర్శించి, విద్యా విధానాలపై అధ్యయనం




# ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారు

- సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే హక్కు రేవంత్ కు లేదన్న హరీశ్
- కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని వ్యాఖ్య
- ఈ ఏడాది 75 శాతం కృష్ణా నీటిని ఏపీ వాడుకుందని ఆరోపణ

**జూన్ 06 ఆంధ్ర ప్రగతి**
పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి "మతిలేని మాటలు" అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.నేడు ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడిన హరీశ్ రావు...బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి **మిగతా 2లో...**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

మొదటిపేజీ తరువాయి

వివరాల్లోకి వెళ్తే, రాజ్యసభ అభ్యర్థులుగా పారిశ్రామికవేత్త సానా సతీష్, ప్రముఖ విద్యావేత్త, భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా విభాగం ముఖ్య నేతగా ఉన్న చింతకాయల విజయ్‌లను ఎంపిక చేసినట్లు పార్టీ ప్రకటించింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై కొంతకాలంగా పార్టీ వర్గాల్లో చర్చలు జరగ్గా, చివరికి అధిష్టానం ఈ ముగ్గురి పేర్లను ఖరారు చేసింది. ఈ ముగ్గురిని చంద్రబాబు ఇవాళ తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి స్వయంగా బి-ఫారాలు అందజేశారు. వారు సోమవారం నాడు నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ఈ మేరకు మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అధికారికంగా పత్రికా ప్రకటన వెలువడింది. కాగా, ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవడం తెలిసిందే. కూటమి పొత్తు ధర్మం ప్రకారం నాలుగు స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయించగా, తమ అభ్యర్థిగా జనసేన పార్టీ లింగమనేని రమేష్ పేరును ఖరారు చేయడం తెలిసిందే.

## జనసేన తరపున లింగమనేని నామినేషన్

మొదటిపేజీ తరువాయి

ఐక్యతను స్పష్టం చేసింది. లింగమనేని రమేష్ నామినేషన్‌ను సమర్థిస్తూ ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేశారు.

నామినేషన్ దాఖలు చేసే సమయంలో కూటమికి చెందిన ఎమ్మెల్యేలు ఆయనకు మద్దతుగా పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి తరలివచ్చారు. వీరిలో నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, బొలిశెట్టి శ్రీనివాస్ నాయక్, వంశీకృష్ణ శ్రీనివాస్, పులపర్తి రామాంజనేయులు, దేవా వరప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, నక్కా ఆనంద్ బాబు, బీజేపీ ప్రతినిధి ఎన్. ఈశ్వర్ రావు తదితరులు ఉన్నారు. మరోవైపు, మిగిలిన మూడు రాజ్యసభ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్ వేయనున్నారు. టీడీపీ అభ్యర్థుల పేర్లు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

## ఏపీలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..

మొదటిపేజీ తరువాయి

జూన్ 4న కేరళను తాకిన రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గత కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి.

మరోవైపు రుతుపవనాల ప్రవేశంతో రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. ముఖ్యంగా వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీ యువత భవిష్యత్తే లక్ష్యం

**మాస్కో,అమరావతి,జూన్ 06ఆంధ్ర ప్రగతి :** ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన.. ప్రముఖ టెక్ సంస్థ యాండెక్స్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అమరావతి, విశాఖపట్నంలో స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థల అమలుపై కీలక చర్చలు జరిగాయి.

ప్రిడిక్టివ్ ట్రాన్సిట్ షెడ్యూలింగ్, పబ్లిక్ సేఫ్టీ అనలిటిక్స్, ఎఐ ఆధారిత ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్స్‌ను రెండు నగరాల్లో ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలించినట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఆధునిక టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేకంగా చర్చలు జరిగాయి. లాస్ట్ మైల్ రవాణా ఖర్చులను తగ్గించే మార్గాలపై కూడా లోకేష్ సూచనలు చేశారు. అలాగే క్విక్ కామర్స్, డెలివరీ ఫ్లీట్లలో ఆటోనమస్ వెహికల్స్ వినియోగంపై యాండెక్స్ బృందంతో చర్చించారు. విశాఖలో ఏర్పాటు చేయనున్న ఎఐ డేటా సెంటర్‌కు సాంకేతిక భాగస్వామ్యం, అలాగే హై-పెర్ఫార్మెన్స్ క్లౌడ్ ఫ్రేమ్‌వర్క్‌ల వినియోగంపై కూడా సమావేశంలో చర్చలు జరిగినట్లు తెలిసింది. స్థానిక పరిపాలనలో ఏఐ మోడల్స్ వినియోగంపై సమావేశంలో చర్చలు జరిపారు. రష్యాలోని స్బేర్ సిటీలో యాండెక్స్ ఉన్నతస్థాయి బృందంతో కూడా మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఐదవ రోజు పలు కీలక సంస్థలతో ఆయన వరుస సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

## ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారు

మొదటిపేజీ తరువాయి

నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. "అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది" అని హరీశ్ రావు ఆరోపించారు. ఈ వైఫల్యానికి గానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేద్దాం

### సామాన్య ప్రజల జీవన , వ్యాపార నిర్వహణ సౌలభ్యాలే లక్ష్యంగా సంస్కరణలు ఉండాలి :(ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో ప్రధాని మోడీ భేటీ

**న్యూఢిల్లీ జూన్ 06ఆంధ్ర ప్రగతి** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న వేళ భారత ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆర్థిక సలహా మండలి(ఈఏసీ) సభ్యులతో సమావేశమయ్యారు. మన దేశ ఆర్థిక వృద్ధిని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన వ్యూహాలు, చర్యలు గురించి చర్చించారు. సామాన్య ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టాల్సిన సంస్కరణలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత్పై, అలాగే ప్రపంచంపై చూపే ప్రభావంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం జరిగిన మరుసటి రోజే ఈ సమావేశం జరగడం గమనార్హం.కాగా శుక్రవారం ఆర్బీఐ గవర్నర్ కీలక ప్రకటనలు చేశారు. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు, సప్లై చెయిన్ అంతరాయాలు ఉన్నప్పటికీ, రెపోరేటును 2.52 శాతం వద్ద యథాతథంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంలో తాము తటస్థ వైఖరిని అవలంబిస్తున్నామని స్పష్టం చేశారు.ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, స్థూల ఆర్థిక పరిస్థితులను సమీక్షించిన తర్వాత, లిక్విడిటీ అడ్జస్ట్మెంట్ ఫెసిలిటీ కింద రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే ఉంచాలని ఎంపీసీ నిర్ణయించిందని చెప్పారు. దీని ప్రకారం, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ 5 శాతం వద్ద, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.5 వద్ద కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన అనిశ్చితితో ఉందని, కీలకమైన వాణిజ్య మార్గాలు, సప్లై చెయిన్లకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటికి తోడు మార్కెట్ ఒడుదొడుకులు లాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే గతంలో వచ్చిన ఇలాంటి పరిస్థితులతో పోల్చితే, నేడు భారత్ మరింత పటిష్టంగా ఉందని, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొంటోందని అన్నారు. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న అవాంతరాలను మనదేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి వచ్చిన ఒక అవకాశంగా పాలసీదారులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమవుతున్న నేపథ్యంలో, గత నెలలో ప్రధాని మోడీ భారత పౌరులకు 7 విజ్ఞప్తులు చేశారు. ప్రధానంగా దిగుమతి చేసుకునే ఇంధనంపై ఆధారపడడం తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించి, దేశ ఆర్థిక రక్షణకు సహకరించాలని ప్రజలను కోరారు. వీటితోపాటు ఇంటి నుంచి పనిచేయడం (వర్క్ ఫ్రమ్ హోమ్)కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇంధన వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. కనీసం ఒక ఏడాదిపాటు విదేశీ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వాడాలని, వంట నూనెల వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. ప్రకృతి వ్యవసాయం (నేచురల్ ఫార్మింగ్) వైపు మళ్లాలని, బంగారం కొనుగోళ్లను నియంత్రించాలని పేర్కొన్నారు.అంతేకాదు ముడి చమురు ధరల్లో వచ్చే ఒడుదొడుకులను తట్టుకోవడానికి, భారతదేశ రవాణా విధానంలో మార్పు రావాలని ప్రధాని మోడీ కోరారు.

# కాక్రోచ్ ల ఆందోళన



మొదటిపేజీ తరువాయి

వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డిలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని



కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# తప్పులు చేసేవారిని వదిలించుకుంటా

మొదటిపేజీ తరువాయి

సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్నాం. అన్నింటికీ మించి ఆత్మవిమర్శ చేసుకుంటున్నాం. అందుకే ఓటమి మన దరికి చేరదు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వారిని, తేడాగా ఉన్నవారిని వదిలించుకోవడానికి వెనుకాడను" అని స్పష్టం చేశారు.

గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచిస్తూ, మంగళగిరి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపారు. "మంగళగిరిలో పార్టీ గెలిచి చాలా కాలమైంది. 2019లో లోకేష్ ఓడినా పట్టు వదలకుండా పనిచేసి, 2024లో అద్భుత విజయం సాధించారు. ఇప్పుడు ఆ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా మార్చారు. అందరూ లోకేష్‌లా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. మంచి సంకల్పంతో పనిచేస్తే దానికి తగ్గ వాతావరణం దానంతట అదే ఏర్పడుతుందని, 'ది సీక్రెట్' పుస్తకాన్ని ప్రతి కార్యకర్తా చదవాలని సూచించారు.

మద్యపానం నిషేధం చేస్తామని హామీ ఇచ్చి గొడ్డలి పార్టీ చేతులెత్తేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. వైసీపీ హయాంలో సీపీఎస్ వారం రోజుల్లో రద్దు చేస్తామని చెప్పి ఎందుకు పక్కన పెట్టేసిందని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శిక్షణ పొందుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై దిశనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ అమలు చేస్తామని గొడ్డలి పార్టీ మాట తప్పిందని ధ్వజమెత్తారు. ఇంతటితో ఆగకుండా వ్యవస్థలను విధ్వంసం చేసిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో చెప్పినవి చేయకపోగా తమ ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025పై బురద జల్లుతోందని ఆగ్రహించారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యపై ఎలా దుష్ప్రచారం చేసి లబ్ది పొందారో... డీఎస్సీ విషయంలోనూ దుష్ప్రచారంతో లబ్దిపొందాలనుకున్నారని దుయ్యబట్టారు.

డీఎస్సీ నిర్వహణపై ఆధారాలతో సహా జగన్ అండ్ కోకు కౌంటర్ ఇచ్చామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కౌంటర్‌తో గొడ్డలి పార్టీ నేతలు డిఫెన్సులో పడ్డారని చెప్పుకొచ్చారు. దుష్ప్రచారం చేయడం, ఫేక్ రాజకీయాలు చేయడం గొడ్డలి పార్టీ విధానం, సిద్ధాంతమని విమర్శించారు. అధికారంలో ఉన్నామని... సహనం, ఓపిక అవసరమని.. కానీ గొడ్డలి పార్టీ ఆగడాలు శ్రుతిమించితే వదిలిపెట్టమని హెచ్చరించారు. మంచి ఆలోచనలు చేసే వాళ్లకు మంచి వాళ్లే సహాయపడతారని అన్నారు. చెడు ఆలోచనలు చేసే వాళ్ల చుట్టూ గొడ్డలి బ్యాచ్ జమ అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకపై టీడీపీకి ఓటమి లేదని, రాదని తెలిపారు. ఆ స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజలతో మంచిగా ఉంటున్నామని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తున్నామని.. సంక్షేమ పథకాలు - అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చామని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నామని.. అందుకే టీడీపీకి ఓటమి రాదని పేర్కొన్నారు. పార్టీ పదవులు మొదలుకుని టికెట్ల కేటాయింపుల వరకు నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రం, పార్టీ శ్రేయస్సు కోసం తప్పులు చేసిన వాళ్లని వదిలించుకుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఏం ప్రచారం చేశారో... అవన్నీ తమ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచిని గడప గడపకు వెళ్లి చెప్పాలని దిశానిర్దేశర చేశారు. ఆనాడు చెప్పిన వాటిని ఈనాడు నెరవేరుస్తున్నామనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. మంగళగిరిలో టీడీపీ గెలిచి చాలా కాలమైందని... 2019 ఎన్నికల్లో నారా లోకేశ్ పోటీ చేసినా ఓడిపోయారని ప్రస్తావించారు. ఆ తర్వాత పట్టుపట్టి పనిచేశారని.. 2024లో అద్భుత విజయం సాధించారని ప్రశంసించారు. గెలిచిన తర్వాత కూడా మంగళగిరిలో లోకేశ్ చక్కగా పని చేస్తున్నారని.. ఇప్పుడు మంగళగిరి టీడీపీకి కంచుకోటగా మారిందని చెప్పుకొచ్చారు. యుద్ధాన్ని గెలిపించే బాధ్యత తనదని... తనతో పాటు అలుపెరగకుండా యుద్ధం చేసే బాధ్యత టీడీపీ శ్రేణులదని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలోనూ గతానికి మించి ఓట్లు రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ పరంగా చేయాల్సిందంతా చేస్తామని స్పష్టం చేశారు. కార్యకర్తలకు అన్నిరకాలుగా అండగా ఉంటామని... ప్రభుత్వం చేసే అభివృద్ధిని అందిపుచ్చుకునేలా కార్యకర్తలు ఆలోచించాలని అన్నారు. భవిష్యత్తు రాజకీయాలకు కూటమితోనే వెళ్తున్నామని.. వెళ్తామని స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు బీజేపీతో పొత్తులో ఉన్నా కూడా ఓట్లు చీలకూడదనే.. టీడీపీతో కలుస్తానని పవన్ కల్యాణ్ చెప్పారని అన్నారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా వెళ్లడంతోనే 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో గెలిచామని ప్రస్తావించారు. పార్టీ అగ్రనేతలు మొదలుకుని... కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ బ్రాడ్ మైండ్‌తో ఆలోచించాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు.

# గోదావరి పుష్కరాలకు మరింత శోభ

మొదటిపేజీ తరువాయి

గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై శనివారం గోదావరి పుష్కరాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లతో, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ... "గోదావరి పుష్కర ఘాట్లు, పుష్కర నగర్ ల వద్ద ఏర్పాట్లు, సౌకర్యాల విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం. ముఖ్యంగా కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణ అనేది లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్తున్నాం. ఇందుకు అనుగుణంగా పని చేయండి. పుష్కర నగర్ల వద్ద పార్కింగ్, వీధి దీపాలు, వస్త్రాలను మార్చుకునే గదులు, జల్లు స్నానాలు, రోడ్లు, డ్రైయిన్లు, ఆలయాలు, ఇతర ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండేలా చూడండి. వాహనాల నిలుపుదలకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ప్రత్యేకంగా ఇవ్వండి. ఏ ప్రాంతం వైపు నుంచి వచ్చే వారు ఆ ప్రాంతంలోనే స్నానాలను ఆచరించి వెళ్లేలా చూడండి. ఘాట్ వెడల్పు, వచ్చే జనంపై ముందస్తు అంచనా అనేది చాలా ముఖ్యం. అవసరం అయితే వచ్చే భక్తులను బట్టి ఘాట్ వెడల్పు పెంచుకునే వెసులుబాటును ముందస్తుగానే ఉంచుకోండి. పంచాయతీల నుంచి చుక్క మురుగు నీరు గోదావరిలో కలవకూడదుగోదావరిలోకి మురుగు నీరు కలవకుండా పక్కా చర్యలు తీసుకోవాలి. పంచాయతీల మురుగు నీటి వ్యవస్థను సరిదిద్దాలి. పుష్కరాలకు సంబంధించిన పంచాయతీల్లో సీసీ రోడ్లు, మ్యాజిక్ డ్రైయిన్ల ద్వారా మురుగు నీటిని సమూలంగా అరికట్టేలా పంచాయతీలవారీగా ప్రణాళికను సిద్ధం చేయండి. గోదావరిలోకి పంచాయతీల నుంచి చుక్క మురుగునీరు కూడా రాకుండా చేయాలి. దీనికి సంబంధించి ఏ పనులు చేయాలి..? ఎంత ఖర్చు అవుతుంది..? అనే ప్రణాళికను వెంటనే చూసుకోవాలి. ప్రధాన ఘాట్లలో గోదావరికి హారతి కార్యక్రమం గురించి దేవాదాయ శాఖను సమన్వయం చేసుకొని ఆలయాల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయండి. మ్యాజిక్ డ్రైన్ల వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. పంచాయతీల్లో మురుగు నీరు కనిపించకుండా ఈ డ్రైన్లు చేస్తున్నాయి. 80 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఘాట్ లో 75 వేల మంది పుష్కర స్నానం చేసేందుకు అనువుగా ఉంటుంది. ఈ ఘాట్ వద్ద అవసరం అయిన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయండి. పార్కింగ్ కోసం రైతుల పొలాలను ఉపయోగించినా, మట్టి తీసినా పార్కింగ్ ఫీజులో వారికి వాటా ఇచ్చేలా ప్లాన్ చేయండి. వారి అనుమతి తీసుకొని పుష్కరాలకు వారి సహాయసహకారాలతోనే ముందుకు వెళ్దాం. ఈ ఘాట్ వద్ద సోమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయాలున్నాయి. వీటిని ఆధునీకరించే పనులు వేగవంతం చేయండి. నేను ఈ నెలలో జరగనున్న కేబినెట్ సమావేశం తర్వాత మునికూడలి ఘాట్ ను సందర్శిస్తాను. చేయాల్సిన పనులను స్వయంగా పరిశీలిస్తాను. సమష్టిగా పనిచేసి పుష్కరాల నిర్వహణలో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలి" అన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీ కృష్ణతేజ, ఓఎస్డీ శ్రీ వెంకటకృష్ణ ఉన్నారు.

# ఎన్టీపిసి ప్లై యాష్‌తో కాలుష్యం నివారణ చర్యలపై అధికారులతో పవన్ సమీక్ష

**,అమరావతి,జూన్ 06 ఆంధ్ర ప్రగతి**

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ నుంచి వెలువడుతున్న ఫ్లై యాష్ (బూడిద) కాలుష్య సమస్య ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి చేరింది. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, జనసేన నాయకుడు అక్కల గాంధీ ఈ సమస్యను పవన్ కల్యాణ్‌కు వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూలపాడు గ్రామానికి వచ్చిన పవన్ కల్యాణ్‌ను స్థానిక నాయకులు కలిసి ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విద్యుత్ కేంద్రం నుంచి వెలువడుతున్న యాష్ కారణంగా పరిసర గ్రామాల్లో పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై పవన్ కల్యాణ్ సుమారు అరగంట పాటు స్థానిక నాయకులు, సంబంధిత వర్గాలతో చర్చించారు. బూడిద కాలుష్యం వల్ల రైతులు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్టీటీపీఎస్ నుంచి వెలువడే్ర÷÷-ల యాష్ కారణంగా చెట్లు, పంటలు, పశువులు ప్రభావితమవుతున్నాయని, గ్రామాల్లో గాలి కాలుష్యం పెరుగుతోందని స్థానికులు చాలా కాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ జెన్కో అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలుష్య నియంత్రణకు సంబంధించిన అంశాలను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచిస్తామని తెలిపారు.

# నిత్యజీవితంలో యోగాను అంతర్భాగంగా చేసుకోవాలి.

## ..యోగాంధ్ర విజయవంతానికి మాస్టర్ ట్రైనర్లే కీలకం.- .జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 6:**
ప్రతి పౌరుడు తమ దైనందిన జీవితంలో యోగా సాధనను అంతర్భాగంగా చేసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండగలరని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.శనివారం కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియం లో యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణ లో భాగంగా నిర్వహించిన మాస్టర్ ట్రైనర్ ల కు శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రజలను యోగా సాధన వైపు ఆకర్షించి, ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉందన్నారు. శిక్షణ కార్యక్రమానికి సమయం తక్కువగా ఉన్నప్పటికీ మాస్టర్ ట్రైనర్లు క్రమశిక్షణతో, అంకితభావంతో పాల్గొనడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి మాస్టర్



ట్రైనర్లు తప్పనిసరిగా హాజరై సంపూర్ణంగా శిక్షణ పొందాలన్నారు. సదరు కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణ చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామస్థాయి ట్రైనర్లకు సమర్థవంతంగా అందించి, యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ మాస్టర్ ట్రైనర్లకు సూచించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు సమాజంలో ఆరోగ్య చైతన్యం పెంపొందుతుందని తెలిపారు.
కార్యక్రమంలో సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, డిఈఓ సుధాకర్, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్,



యోగాంధ్ర ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డా.అమర్నాథ్, ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.చంద్రిక, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, డిప్యూటీ డీఈఓ శ్రీధర్ బాబు, ఎంఈఓలు అబ్దుల్ రహిమాన్, నాగరాజు, ఆదం భాష, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ, జిల్లా యోగా సంఘం కార్యదర్శి మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

## ..మీడియా సహృద్భావ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 06 :**
జిల్లా సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు.
శనివారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో సహృద్భావ సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్న విధంగా ఎల్నినో ప్రభావం లేకుండా దేవుని దయ వలన జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, త్రాగు , సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలని కోరుకుంటున్నానని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులు అమలు చేయడం జరుగుతోందని, జల ధార – జల హారతి లో భాగంగా వీబీ జీ రామ్ జీ పథకం సమన్వయంతో పూడిక తీత, నీటి సంరక్షణ పనులు చేయించడం జరుగుతోందని, తద్వారా భూగర్భ జలాల పెంపు, ఉపాధి కల్పించడం జరుగుతోందన్నారు. కార్పొరేట్ సంస్థల సహాయంతో 14 యంత్రాలు ఏర్పాటు చేసి 27 చెరువుల పూడిక తీయించడం జరిగిందన్నారు. జిల్లా లోని ఓర్వకల్లు నోడ్ ద్వారా పారిశ్రామికాభివృద్ధి కి కృషి జరుగుతోందన్నారు. ఆలూరు, ఆస్పరి ప్రాంతంలో



విండ్,సోలార్ మిల్స్ ఏర్పాటు చేయడం జరుగుతోందని, ఆదోని ప్రాంతంలో కూడా పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలు అరికట్టడం , వలసలు అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ ఏడాది సీజనల్ హాస్టల్స్ ముందుగానే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో అందర్నీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. మిశ్రమ పంటల పై ప్రతి సమావేశంలో అవగాహన కల్పిస్తూ, జిల్లాలో హార్టికల్చర్ ను పెంచడానికి కృషి చేస్తూ ఉన్నామని, ఇందులో భాగంగా 20 వేల హెక్టార్ల హార్టికల్చర్ అదనంగా పెంపునకు కృషి చేస్తున్నామని , డ్రిప్ ఇరిగేషన్ కు అత్యధిక ప్రాముఖ్యత ఇస్తున్నామని దీని ద్వారా భూగర్భ జలాల సంరక్షణ కూడా జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురవడం వలన 89% పంట విస్తీర్ణత పెరగడం జరిగిందని దీని వలన రైతులు అందరూ ఒక్కసారిగా యూరియా కొనడానికి ముందుకు వచ్చారని అంతే కానీ జిల్లాలో ఎప్పుడూ యూరియా కొరత లేదని తెలిపారు. 22ఏ చుక్కల భూముల విడుదల లో భాగంగా ఇప్పటివరకు 86 వేల ఎకరాలు విడుదల చేశామని ఇంకా అంతే మొత్తంలో చేయవలసిన పని ఉన్నదని తెలిపారు. బ్యాంకుల ద్వారా సిసిఆర్ కార్డ్ కలిగిన రైతులకు , ఎమ్మెస్ ఎం ఈ మరియు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు , ఉన్నత విద్య కొరకు విద్యార్థులకు రుణాలు ఇప్పించటానికి కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో పరిశుభ్రతపై దృష్టి పెట్టి పనులు చేయించడం జరుగుతూ ఉన్నదని , నదులు , కాలువలు లలో చెత్త వేసే సాంప్రదాయాన్ని ప్రజలు విడనాడాలని జిల్లా కలెక్టర్ పలు విషయాలపై స్పందించారు.
ఈ సమావేశానికి డిఆర్ఓ వెంకటనారాయణమ్మ , సమాచార శాఖ డిడి జయమ్మ మరియు ప్రింట్ మరియు

# యోగా ను జీవన విధానంగా మార్చుకోవాలి.

## ..యోగాంధ్ర - 2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి. -.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 06:**
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర2026" కార్యక్రమాలను నంద్యాల జిల్లాలో విస్తృత స్థాయిలో చేపడుతూ ప్రజల్లో యోగా పట్ల అవగాహన, ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాల విజయవంతమైన అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నంద్యాల ఇండోర్ స్టేడియంలో యోగా మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో నమోదు చేసుకున్న మాస్టర్ ట్రైనర్లు అందరూ తప్పనిసరిగా ఓటీపీ ద్వారా తమ వివరాలను ధృవీకరించుకుని తిరిగి నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని, శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు జిల్లావ్యాప్తంగా యోగా ప్రచారం, శిక్షణ కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ తెలిపారు. యోగాంధ్ర – 2026 కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 7న నంద్యాల ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం



నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు, విద్యార్థులు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొంటారని తెలిపారు. అనంతరం జూన్ 8న శ్రీశైలంలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక క్షేత్ర వాతావరణంలో యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ప్రశాంతతను ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. జూన్ 12న మహానందిలో సుమారు 500 మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 17న జిల్లాలోని వివిధ యోగా సంఘాలు, యోగా అసోసియేషన్లు కలిసి యోగా ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తాయని, ఈ సందర్భంగా యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసే విధంగా ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా



దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రధాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. యోగాను ప్రజల జీవనశైలిలో భాగం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జూన్ నెలను "యోగా మాసం"గా ప్రకటించిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జూన్ 7 నుండి జూన్ 21 వరకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. జిల్లాలో అందుబాటులో ఉన్న యోగా సంఘాలు, శిక్షణ కేంద్రాల ద్వారా యోగా అభ్యాసం చేసి ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

# బీజేపీలో కీలక నియామకాలు చేసిన జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు.

**-36 మండలాలకు ఇంచార్జ్‌ల ప్రకటన.**
**-రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియామకాలు**
**-క్షేత్రస్థాయి బలోపేతమే లక్ష్యం**
**- నాయకులు , శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి**
**-నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**
నంద్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ఆ పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జిల్లాలోని మొత్తం 36 మండలాలకు సీనియర్ నాయకులు, జిల్లా పదాధికారులను ఇంచార్జ్‌లుగా నియమిస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ.. పార్టీ నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ప్రతి ఒక్క నాయకుడు నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షులు, కొత్తగా నియమితులైన ఇంచార్జ్‌లు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై పోరాడుతూ, పార్టీ బలోపేతం కొరకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కొత్త నియామకాల ద్వారా జిల్లాలో పార్టీ కార్యక్రమాలు మరింత వేగవంతం కానున్నాయని వివరించారు.



**మండలాల వారీగా ఇంచార్జ్‌ల పూర్తి వివరాలు:**
శ్రీశైలం ఇంచార్జ్‌గా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు స్వయంగా బాధ్యతలు చేపట్టనున్నారు.
ఆళ్ళగడ్డ రూరల్ కాశెట్టి చంద్రశేఖర్,నందికొట్కూరు అర్బన్ ఓ. కిరణ్, ఔకు ఎ. శివకృష్ణ యాదవ్, బేతంచెర్ల అర్బన్ ఎస్.వి. రమణ, కొలిమిగుండ్ల నిమ్మకాయల సుధాకర్, బేతంచెర్ల రూరల్ పసుపుల రవీంద్రకుమార్,నంద్యాల రూరల్ ఉపేంద్రనాథ్ రెడ్డి,రుద్రవరం ఎ. మనుప్రియ రెడ్డి,పగిద్యాల ఈ. శంకర్ గౌడ్,బనగానపల్లె అర్బన్ పాతి నాగమోహన్ రెడ్డి,డోన్ అర్బన్ బి. శరత్ చంద్ర కుమార్,
ప్యాపిలి అంబటి సుబ్బా రెడ్డి,మిడుతూరు వై. బాలముని, బనగానపల్లె రూరల్ అంచా హరికృష్ణ,నంద్యాల అర్బన్–1 కాశెట్టి కృష్ణమూర్తి,బండి ఆత్మకూరు మేడ మురళీధర్,వెలుగోడు ఖాదర్బాద్ నరసింగరావు,గోస్పాడు డా. ఇంటి ఆదినారాయణ,నంద్యాల అర్బన్–3 వి. గోపాల కృష్ణమూర్తి,ఆత్మకూరు అర్బన్ మోమిన్ షబానా,ఆత్మకూరు రూరల్ బుడ్డా శ్రీకాంత్ రెడ్డి, పాములపాడు మల్లెల కృష్ణారెడ్డి,సంజామల బి. లింగన్నఆళ్ళగడ్డ అర్బన్ బత్తిని స్వాతిఉయ్యాలవాడ మేకల లక్ష్మి ఓబులేసు,నందికొట్కూరు రూరల్ పాపిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి,కొత్తపల్లి చల్లా దామోదర్ రెడ్డి,చాగలమర్రి బోరెడ్డి లక్ష్మి రెడ్డి,కోయిలకుంట్ల బి.వి. సుబ్బా రెడ్డి,జూపాడు బంగ్లా సిలివేరి వెంకటేష్,డోన్ రూరల్ పడకండ్ల నాగేశ్వరరావు,మహానంది బిజ్జం సుబ్బా రెడ్డి,నంద్యాల అర్బన్–2 పసుపుల శివ సాయి సందీప్,సిరివెళ్ల మండల ఇంచార్జ్ ఎంపీటీసీ భగవాన్, దొర్నిపాడు కొత్తమిద్దె శ్రీరాములు నియమితులయ్యారు.

# శ్రమజీవుల అభ్యున్నతికి పోరాడిన అజరామరుడు.

## భూ పోరాట యోధుడు కామ్రేడ్. చంద్ర రాజేశ్వరరావుకి ఘన నివాళి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:** భూమి కోసం, శ్రమజీవుల హక్కుల కోసం యావజ్జీవితాన్ని అంకితం చేసిన అజరామరుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ని కొనియాడారు శనివారం నంద్యాల పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్ అధ్యక్షతన కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 112వ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ..
సి.ఆర్ ధనిక భూస్వామ్య కుటుంబంలో జన్మించినా, నిరాడంబరంగా జీవిస్తూ పేదల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావాలు అలవర్చుకుని, బెనారస్‌లో ఆర్.ఎస్.ఎస్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టారన్నారు. స్వగ్రామం మంగళాపురంలో 5 వేల ఎకరాల అటవీ భూమిని పేదలకు దక్కేలా చేసి భూపోరాటానికి శ్రీకారం చుట్టారని, చల్లపల్లి, మునగాల జమీందారీ వ్యతిరేక ఉద్యమాలకు దిక్సూచిగా నిలిచారని పేర్కొన్నారు.1969–70లో సిపిఐ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్త భూపోరాటానికి నాయకత్వం వహించి, నాటి ఇందిరాగాంధీ ప్రభుత్వం భూసంస్కరణల చట్టం తెచ్చేలా చేశారన్నారు. క్లిష్ట కాలంలో పార్టీని బలోపేతం చేస్తూ ఆయన రాసిన 'పార్టీ నిర్మాణం' గ్రంథం నేటికీ మార్గదర్శకమన్నారు. వామపక్ష ఐక్యత కోసం పదవులను త్యాగం చేసిన ఆయన, అంతర్జాతీయంగా "ఆర్డర్ ఆఫ్ లెనిన్" అవార్డు గ్రహీతగా భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయ్, రవికుమార్ ఏ ఐ టి యు సి మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

## సంక్షేమం-సుపరిపాలన దిశగా

# రెండేళ్లు పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం.

## సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యం.

## నంద్యాల జనసేన పార్టీ నేత మారాసు గురుబాబు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంక్షేమం--సుపరిపాలన దిశగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి నంద్యాల జనసేన పార్టీ నేత నంద్యాల జనసేన పార్టీ నేత మారాసు గురుబాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తుండగా,అన్నదాత సుఖీభవ పథకం కింద రైతు కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వ పీఎం–కిసాన్ సాయంతో కలిపి సంవత్సరానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు వికలాంగులకు




కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.. వృద్ధాప్య పెన్షన్ను రూ.4 వేలకు, వికలాంగుల పెన్షన్ను రూ.6 వేలకు పెంచినట్లు తెలిపారు. దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నారని, పేదలు, కూలీల కోసం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి రూ.5కే నాణ్యమైన భోజనం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నంద్యాల జనసేన పార్టీ నేత మారాసు గురుబాబు తెలిపారు

# ఆరోగ్యకర జీవనానికి ఆర్గానిక్ వ్యవసాయం

## తాడేపల్లి ఆర్గానిక్ ఫామ్‌ను సందర్శించిన మంత్రి సవిత



**అమరావతి,జూన్6ఆంధ్ర ప్రగతి**
ఆరోగ్యకర జీవనానికి ఆర్గానిక్ వ్యవసాయం అవసరమని మంత్రి సవిత అన్నారు. తాడేపల్లిలో ఆర్గానిక్ ఫామ్‌ను మంత్రి సవిత సందర్శించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి సైకిల్‌పై ప్రాతూరు రోడ్డులోని ఆర్గానిక్ వెజిటబుల్ ఫామ్‌ను మంత్రి సందర్శించారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు



దోహదం చేస్తుందన్నారు. ఆర్గానిక్ కూరగాయలు ఆరోగ్య రక్షణకు మేలు చేస్తాయన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు సేంద్రియ ఆహారం అవసరమని చెప్పుకొచ్చారు. 15 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో ఫామ్ సాగు చేస్తోందని.. రసాయన ఎరువులు లేకుండా కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపు కోసం సైకిల్ వినియోగాన్ని మంత్రి ప్రోత్సహించారు. దగ్గర ప్రాంతాలకు కాలినడకన లేదా సైకిల్‌పై వెళ్లాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంధన వాహనాలు వినియోగించాలన్నారు. ప్రధాని మోదీ పిలుపు, సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# వ్యర్థాల విభజనతో ప్రజారోగ్యం - పర్యావరణ పరిరక్షణ.

**- 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో కలెక్టర్, డాక్టర్ ఏ.సిరి**

**- ప్రజలు ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేయాలి**

**- బల్క్‌వేస్ట్ జనరేటర్లు వద్ద వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కేంద్రాలు తప్పనిసరి**






**ఆంధ్ర ప్రగతి కర్నూల్ టౌన్ జూన్ 06:** నగర ప్రజలు తమ ఇంటి వద్దే వ్యర్థాలను తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక (హానికర) వ్యర్థాలుగా వేర్వేరుగా విభజించి అందించడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి తెలిపారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో వారం 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్డీవో సందీప్‌తో కలిసి ఆమె ఇంటి వద్దే వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే బిర్లా కాంపౌండ్‌లో బల్క్ జనరేటర్ వద్ద ఉన్న వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కేంద్రాన్ని, గార్గేయపురం డంప్‌యార్డులో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు.

మద్దూర్ నగర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు2026 ప్రకారం ఉత్పత్తి వద్దే వ్యర్థాల విభజనపై స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక వ్యర్థాలను నాలుగు వర్గాలుగా వేరు చేసి నగరపాలక సిబ్బందికి అందించాలని సూచించారు. చెత్తను కలిపి ఇవ్వడం వల్ల పునర్వినియోగం, శాస్త్రీయ నిర్వహణకు ఆటంకం ఏర్పడుతుందని, విభజించి ఇవ్వడం ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణానికి ప్రతి కుటుంబం భాగస్వామి కావచ్చని పేర్కొన్నారు. అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు – 2026 పోస్టర్లు ఆవిష్కరించారు.

అనంతరం బిర్లా కాంపౌండ్‌లోని వాల్‌మార్ట్ (బల్క్ వేస్ట్ జనరేటర్) ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ), తడి వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్, ప్రమాదకర వ్యర్థాల నిల్వ కేంద్రం, పునర్వినియోగయోగ్య పొడి వ్యర్థాల నిల్వ కేంద్రాలను పరిశీలించారు. రోజుకు 100 కిలోలకుపైగా వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థల నిర్వాహకులు తప్పనిసరిగా తమ వద్దే వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నగరపాలక పారిశుద్ధ్య విభాగ అధికారులు, సిబ్బంది ఇతర సంస్థలకు ఈ నమూనాలను చూపించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం వాల్‌మార్ట్ ఆవరణలో మొక్కలు నాటారు.

అనంతరం గార్గేయపురం డంప్‌యార్డులోని విండ్రో కంపోస్టింగ్ యూనిట్లు, వర్మీ కంపోస్టింగ్ యూనిట్లు, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) కేంద్రాలను పరిశీలించారు. వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా కంపోస్టు తయారీ, పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. అదేవిధంగా కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు2026 ప్రకారం నగరంలో అధిక మొత్తంలో వ్యర్థాలు ఉత్పత్తి చేసే బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, పెద్ద హోటళ్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు తదితర సంస్థలు తమ వద్దే వ్యర్థాలను ప్రాసెస్ చేసి కంపోస్టుగా మార్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలు ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లు, 20 వేల చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన వ్యాపార సముదాయాలు, రోజుకు 40 వేల లీటర్లకు పైగా నీటిని వినియోగించే సంస్థలు ఈ నిబంధనల పరిధిలోకి వస్తాయని వివరించారు.

తమ వద్ద ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలను స్థానికంగానే కంపోస్టింగ్ చేయాలని, పొడి వ్యర్థాలను పునర్వినియోగానికి పంపించాలని, శానిటరీ, హానికర వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి నగరపాలక సంస్థకు అప్పగించాలని సూచించారు. ముఖ్యంగా కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌లో మిగిలిపోయే ఆహార పదార్థాలను మురుగునీటి కాలువల్లో కలపకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక కంపోస్టింగ్ యూనిట్లు, వ్యర్థాల సేకరణ డబ్బాలు, రికార్డు నిర్వహణ రిజిస్టర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు ఇంటి వద్దే చెత్తను నాలుగు వర్గాలుగా వేరు చేసి ఇవ్వడం, ప్రతి బల్క్ వేస్ట్ జనరేటర్ తమ వద్దే వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా మాత్రమే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, కాలుష్యరహిత కర్నూలు నగర నిర్మాణం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు.

తక్కువ ఖర్చుతో వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని, థర్డ్ పార్టీ రీసైక్లింగ్ ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే ఈ వ్యవస్థను బల్క్ వేస్ట్ జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఎస్ఈ రమణమూర్తి, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, ఏఈ వైష్ణవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ప్రజారోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# స్వచ్ఛ నంద్యాల కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

**."ఆపరేషన్ క్లీన్ స్వీప్" ద్వారా పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక కార్యాచరణ.**

**.జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 06 :** నంద్యాల పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా, ప్రజలకు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా నగర్ (గవర్నమెంట్ హాస్పిటల్ లైన్) ప్రాంతంలో నిర్వహిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో ఎక్కడెక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయో గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో తొలగించడం, పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరిశుభ్రతను కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో సాధించాల్సిన సామూహిక కర్తవ్యంగా భావించాలని సూచించారు. పట్టణ పరిధిలో రోజువారీగా అధిక మొత్తంలో వ్యర్థాలను ఉత్పత్తి చేసే ఆసుపత్రులు, హోటళ్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు మరియు గేటెడ్ కమ్యూనిటీల వంటి బల్క్ వేస్ట్ జనరేటర్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ వివరించారు. ఇటువంటి సంస్థలు తప్పనిసరిగా తడి చెత్త, పొడి చెత్తలను విడివిడిగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని సూచించారు. తడి చెత్తను స్థానికంగా కంపోస్టింగ్ చేయడం ద్వారా సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని, అలా చేయలేని పరిస్థితుల్లో మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన బయోడైజెస్టర్ యూనిట్లకు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత సంస్థలకు అవగాహన కల్పిస్తూ అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని చెప్పారు.

ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం ఒక ప్రత్యేక థీమ్‌ను ఎంపిక చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ వారం "బల్క్ వేస్ట్ జనరేటర్లకు అవగాహన కల్పించడం" అనే అంశాన్ని ప్రధాన థీమ్‌గా తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందని పేర్కొంటూ, దాని వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయోడిగ్రేడబుల్ సంచులు, మొక్కజొన్న ఆధారిత పర్యావరణహిత కవర్లు మరియు ఇతర ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. ఈ విషయమై సంబంధిత సంస్థలకు అడ్వైజరీ నోట్లు కూడా జారీ చేసినట్లు తెలిపారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, అందమైన నంద్యాల నిర్మాణానికి ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లో వేయాలని, ఇంటి వద్దనే తడి–పొడి చెత్తను వేరు చేయాలని కలెక్టర్ సూచించారు.





# సద్దల చంద్రశేఖర్ రెడ్డి పుట్టినరోజున దివ్యాంగులకు అన్నదానం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:** హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు సద్దల చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నంద్యాలలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన చంద్రశేఖర్ రెడ్డి అభిమాని (షఫీ) అలియాస్ చోటు. హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా ప్రతి ఒక్క నిరుపేద ప్రజలకు మరియు వికలాంగులకు, వృద్ధులకు వితంతులకు ప్రతి ఏటా అన్నదాన కార్యక్రమం నిర్వహించడమే కాకుండా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ అంధుల పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందిస్తూ వారి విద్య బోధనకు సంబంధించిన అనేక పరికరాలు అందించిన గొప్ప సొసైటీ హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ. శనివారం హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా నంద్యాల పట్టణంలోని చామ కాలువ దగ్గర ఉన్న ఉషా మనో వికాస్ కేంద్రం (బర్డ్స్),పాఠశాలలో చంద్రశేఖర్ రెడ్డి అభిమాని చోటు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు చేస్తున్న సేవలను గుర్తించి స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాన్ని నిరుపేదలకు కడుపునిండా భోజనం పెట్టాలని ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చోటు తెలిపారు. ఆయనతోపాటు రవి ,రమేష్, తిరుపతయ్య, లక్ష్మణ్ ,చిన్న, అశోక్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాసులు రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని, రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్ మరియు జోన్–5 కోఆర్డినేటర్ పెల్లకూరు శ్రీనివాసులు రెడ్డి గారు నంద్యాలలోని మంత్రిగారి క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మంత్రి ఫరూక్ కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, మైనార్టీ సంక్షేమ పథకాల అమలు మరియు కార్మికుల కనీస వేతనాల అంశాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, మాజీ కౌన్సిలర్లు మిద్దె ఉసేని , శ్రీదేవి, అంజాద్ భాషా సిద్ధికి, గోస్పాడు హుస్సేన్, జయప్రకాష్, బషీర్ పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్షాలు తక్కువ అందుకు అనుగుణంగా పంటలు వేసుకోవాలి

## -జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**

జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వారు శ్రీ నున్నా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఖరీఫ్ సన్నాహకాల పై నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి మరియు ఇన్పుట్ డీలర్స్ కు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి నంద్యాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..

వ్యవసాయ సిబ్బందికి ఈ సవత్సరం ఎలినో ప్రభావం ఉంటుంది కాబట్టి అందుకు అనుగునంగా పంటలు, రకాలు ఎంపిక చేస్కునేవిధంగా రైతులకు అవగాహనా కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలని చెప్పడం జరిగింది.అదే విధంగా విశిష్ట సేవా సంఖ్య ప్రతీ ఒక్క రైతుకు తప్పని సరిగా చేయించాలని విశిష్ట సేవా సంఖ్య ప్రాముఖ్యతను అనగా

1.పీఎం కిసాన్ చెల్లింపులు
2.పంటల భీమా
3.పంట ఋణాలపై వడ్డీ రాయితీ
4.రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు,
5.రాయితీ పై సూక్ష్మ పోషకాలు,
6.సూక్ష్మసేద్యం పై రాయితీ,
7.పంట ఋణాలు
8.పెట్టుబడి సాయం.

తదితర పథకాలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి, వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుంది అని గ్రామాలాలో రైతులకు తెలియజేయాలని,అదే విధంగా ఖరీఫ్ పంటకు ఎరువులు ఈ సవత్సరం ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ కార్యక్రమం అనగా వారి లాగిన్ నందు రిటైల్ డీలర్లను మాపింగ్ చేయడం, రైతులకు యూరియా అమ్మే ప్రక్రియ పై ఆర్ ఎస్ కె సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగింది.







ఇన్పుట్ డీలర్ల తో వ్యవసాయ చట్టాలు నియమ నిభందనలు పై అవగాహనా కార్యక్రమం:–

ఈ సందర్భంగా ఉప వ్యవసాయ సంచాలకులు గంగాధర్ రావు మాట్లాడుతూ నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని ఇన్పుట్ డీలర్లు అందరూ వ్యవసాయ చట్టాలు నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం నిర్వహించాలని డీలర్లు ప్రతీ రోజు స్టాక్ బోర్డు మరియు ధరల పట్టిక నిర్వహించాలని, ప్రతీరోజు స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేసుకోవాలని, ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందులు మాత్రమే అమ్మాలని, అదేవిధంగా ఎమ్మార్పీ ధరల కు మించి అమ్మరాదని, బిల్ బుక్ సక్రమంగా నిర్వహించాలని, అదే విధంగా ఈపాస్, గ్రౌండ్ బ్యాలన్స్, స్టాక్ రిజిస్టర్ లో వ్యత్యాసాలు లేకుండా నిర్వహించుకోవాలని చట్టాలకు లోబడి వ్యాపారం నిర్వహించికోవాలని లేని యెడల చట్టపరమైన చర్యలు తీస్కుంటామని హెచ్చరించడం జరిగింది. అలాగే ఈ ఖరీఫ్ సీజన్ నుండి యూరియా మరియు డి.ఏ. పి ఎరువులను ఏపీ ఏఐఎంఎస్ ఆప్ ద్వారా నే డీలర్లు అందరూ విక్రయించాలని, అందుకుగాను ఆప్ వాడకం పై ఎరువుల డీలర్లు కు శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో సహాయ వ్యవసాయ సంచాలకులు నంద్యాల వారు జయ ప్రకాష్ రెడ్డి గారు, మండల వ్యవసాయ అధికారులు ప్రసాద రావు, నాగేశ్వర రెడ్డి, సుబ్బా రెడ్డి, పవన్, పవన్ కుమార్ నంద్యాల సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ రోడ్డు నిర్మాణంపై విజిలెన్స్ విచారణ చేపట్టండి.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 06:** మహానంది మండలంలోని గోపవరం గ్రామంలో దాదాపు 40 లక్షల రూపాయలతో జరుగుతున్న మట్టి రోడ్డు నిర్మాణం పై విజిలెన్స్ విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం . గోపవరం గ్రామం రైల్వే ట్రాక్ నుండి పంట పొలాలకు వెళ్లే రహదారి నిర్మాణం కోసం గాజులపల్లె.2 నుండి ఒక డీ పట్టా గా భావిస్తున్న పొలం నుండి అక్రమంగా మట్టిని తరలించి రోడ్డు నిర్మాణానికి వాడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి మొరుసు/ గ్రావెల్ వాడాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా వాడుతున్న నాసిరకం మట్టి వాడటం వల్ల వర్షాకాలంలో వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు ప్రశ్నలు లేవనెత్తుతున్నట్లు తెలుస్తుంది. ఇవి ఇంజనీరింగ్ అధికారులకు తెలియవా లేక ఒత్తిళ్లకు లోబడి అనుమతించారా అనేది తెలియాల్సి ఉంది. తూతూ మంత్రంగా రోడ్డు నిర్మాణం చేపట్టి రైతుల నెత్తిన ఇంత మట్టి చల్లి నిధులు దుర్వినియోగానికి పాల్పడతారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇంతకు రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా లేదా ఉంటే ఎలాంటి పర్యవేక్షణ లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంపై పలు ఆరోపణలతో పాటు విమర్శలు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తుంది. దోచుకున్నోళ్లకు... దాచుకున్నంత అనే విధంగా రోడ్డు నిర్మాణం కొనసాగుతుందని దీనిపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించి విచారణ చేస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోనికి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

## అబాండం తండా ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు వినతి పత్రం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**
నంద్యాల పట్టణ పరిధిలోని సుగాలిమెట్ట అబాండం తండా నివాసితులు ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ..ఆ ప్రాంత ప్రజలు శనివారం నాడు నంద్యాలలోనే మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అబాండం తండా ప్రజలు మాట్లాడుతూ గతంలో మంత్రి ఫరూక్ గారే తమకు పట్టాలు ఇచ్చారని అనంతరం వచ్చిన ప్రభుత్వం ఆ పట్టాలకు బదులు వేరే పట్టాలు ఇచ్చిందని అందులో సర్వే నెంబర్లు వేరువేరు ఉండడం ద్వారా తండాలో దశాబ్దాలుగా నివసిస్తున్నప్పటికీ, ఇప్పటికీ చాలా మందికి ఇళ్ల పట్టాలు సరిగ్గా లేవన్నారు. పట్టాలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు పొందడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పట్టాలు మంజూరు చేసి, తమ నివాసాలకు భద్రత కల్పించాలని వారు మంత్రి ఫరూక్ ని కోరారు. వినతి పత్రాన్ని స్వీకరించిన మంత్రి ఫరూక్ సమస్యపై సానుకూలంగా స్పందించారు. అబాండం తండా ఇళ్ల పట్టాల వ్యవహారాన్ని సంబంధిత రెవెన్యూ అధికారులతో మాట్లాడి, నిబంధనల ప్రకారం త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తండాకు చెందిన స్వామి నాయక్, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , ప్రముఖులు, బాధితులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఉర్దూ ఉపాధ్యాయులకు ఉచిత టెట్ మెటీరియల్

**-మంత్రి అల్‌హాజ్ ఎన్ఎండి ఫరూక్.**

**-మైనారిటీల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.**

**-వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో 'తాలీమ్ హునర్' ద్వారా కార్పొరేట్ విద్యా అవకాశాలు.**

**-ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధుల భేటీలో మంత్రి ఫరూక్ హామీ.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**
రాష్ట్రంలో టెట్ 2026 పరీక్షకు హాజరవుతున్న ఉర్దూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం తరపున ఉచితంగా స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తామని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్‌హాజ్ ఎన్ఎండి ఫరూక్ ప్రకటించారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ సి. అబ్దుల్ అజీజ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం మంత్రి ఫరూక్ గారిని నంద్యాల లోని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు . ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వీసులో ఉంటూ టెట్ పరీక్ష రాయబోతున్న 2,650 మంది ఉర్దూ సెకండరీ గ్రేడ్ టీచర్లకు సి ఇ డి ఎఫ్ తరపున ముద్రించిన టెట్ మెటీరియల్‌ను అందించాలని మంత్రి ఫరూక్ కి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ విన్నపంపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ, ఉర్దూ ఉపాధ్యాయులకు సీఈడీఎం ద్వారా తప్పకుండా అధ్యయన సామగ్రిని ఉచితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు తమ విధులను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ముస్లిం మైనారిటీ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని సర్వతోముఖంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, నీట్ జేఈఈ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలకు కోచింగ్ ఇప్పించేందుకు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో తాలీమ్ హునర్ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు . పదో తరగతి పాసైన విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి, మెరిట్ సాధించిన 250 మంది విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత విద్యను అందిస్తున్నాము అన్నారు ." మైనారిటీల హక్కుల పరిరక్షణకు, విద్యార్థుల వికాసానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. ఈ భేటీలో ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సి. అబ్దుల్ అజీజ్, మహమ్మద్ ఇబ్రహీం, షమీమ్ బాను, ఫరహీన్, హుస్సేన్ బాషా, షమీమ్ బేగం, అఫ్సర్ జహాన్, షబానా, మహమ్మద్ ఇక్బాల్ తో పాటు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ , మజ్లిస్-ఎ-ఉలమా వల్ అయిమ్మా ప్రతినిధి హాఫిజ్ అంజద్ బాషా సిద్దిఖీ, ఉపాధ్యాయులు మహమ్మద్ ఫారూఖ్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల్లో అక్షరాస్యతను పెంచడం కోసం 40 డెస్ గో టు విలేజీ ప్రోగ్రాం.

**..ఎస్సీ వర్గీకరణ ఫలాలను అందిపుచ్చుకొని విద్యా ఉద్యోగాల్లో ముందుకు రావాలి.**

**..జులై 7 న ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవాన్ని మాదిగ జాతి పండుగగా జరుపుకోవాలి.**

**..ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 06:**
మాదిగ సామాజిక వర్గంలో డ్రాప్ అవుట్స్ ని తగ్గించి, విద్యా అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మే 25 నుండి ప్రారంభమైన కార్యక్రమం జులై 5 వరకు 40 రోజుల పాటు నిర్విరామంగా గో టు విలేజ్ కార్యక్రమం జరుగుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ తెలిపారు. శనివారం నంద్యాల టౌన్ ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం మున్సిపల్ పార్క్ లో నిర్వహించడం జరిగింది.
ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. మున్నంగి నాగరాజు మాదిగ మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం ద్వారా సాధించిన వర్గీకరణ ఫలితాలు మాదిగ ప్రజలు సంపూర్ణంగా అందుకునేందుకు గోటు విలేజ్ కార్యక్రమానికి మంద కృష్ణ మాదిగ గారు పిలుపు పిలుపు నిచ్చినట్లు తెలిపారు. అక్షరాస్యతలో తీవ్రంగా వెనుకబడిన కులంగా మాదిగలు ఉన్నారని అన్నారు. అందువల్ల మాదిగలకు విద్యా యొక్క ప్రాముఖ్యతను వివరించి అక్షరాస్యతను పెంపొందించడం కోసం ప్రతి గ్రామాల్లో చైతన్య సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ లో ఎస్సీ వర్గీకరణ ఫలితాలు 6.5 శాతంగా అమలు జరుగుతున్నందున రిజర్వేషన్ సదుపాయాలు మాదిగలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందులూ, కుటుంబ సమస్యలు మొదలగు ఇబ్బందుల వల్ల మాదిగలు చదువులకు దూరం కావద్దు అని అన్నారు. అత్యంత పేదరికంలో ఉన్న మాదిగలు అభివృద్ధిలోకి రావాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు. ఉన్నత చదువుల కోసం అందుబాటులో ఉన్న అన్ని రకాల మార్గాలను ఉపయోగించుకుందాం అని అన్నారు. 30 ఏళ్ల పోరాటం చేసి సాధించిన వర్గీకరణ ఫలాలను అందుకొని ఉన్నత విద్యారంగంలో , ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ జాతి రాణించాలని పిలుపునిచ్చారు. మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో నూతన జెండా దిమ్మెలను నిర్మాణం చేసుకోవాలని కోరారు. జులై 7 న మాదిగ జాతి పండుగగా ఎమ్మార్పీఎస్ జెండా పండుగ చేసుకోవాలని కోరారు. అలాగే అన్ని మాదిగ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నూతన కమిటీ నిర్మాణాలను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలోఎమ్ ఎస్ పి జాతీయ నాయకులు చిలుక రాబిన్ సన్ మాదిగ ఎం ఈ ఎఫ్ జాతీయ నాయకులు బుచ్చర్ల నరసింహులు మాదిగ ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాయికాటి బెనర్జీ మాదిగ, ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు కోల కల్యాణ్ మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి భూమనపాటి నరసింహులు మాదిగ, నంద్యాల మండల అధ్యక్షులు సానికేల రాము మాదిగ ,నంద్యాల టౌన్ నాయకులు కొమ్ము చంటి మాదిగ,గోస్పాడు మండల అధ్యక్షులు మద్దిలేటి మాదిగ, ఎమ్మెస్ ఎఫ్ నాయకులు బన్నీ మాదిగ, ఎం ఎస్ పి సీనియర్ నాయకులు పుల్లయ్య మాదిగ, దస్తగిరి మాదిగ,పాల కృష్ణ మాదిగ,మల్లెల శివ లింగం మాదిగ,పుల్లయ్య మాదిగ,మహిళ నాయకురాలు నందిని మాదిగ,మనోహర్ మాదిగ, వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా రహిత సమాజమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.

**'నవోదయం 2ూ' లో భాగంగా గడివేముల మండలం ఎల్ కే తాండ లో అవగాహన సదస్సు.**




**ఆంధ్ర ప్రగతి గడివేముల/ ఎల్కేతండా జూన్ 06:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవోదయం 2.O' కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సాదు



రవికుమార్ సూచనలు మేరకు శనివారం గడివేముల మండలం ఎల్కేతాండ నందు నాటుసారా తయారీ, అమ్మకాల నివారణపై ఒక ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని, నాటుసారా వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ, ఈ వృత్తిని మానుకుని ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల ద్వారా గౌరవప్రదమైన జీవితాన్ని సాగించాలని పిలుపునిచ్చారు.

**అధికారుల ప్రసంగాలు - ముఖ్యమైన అంశాలు:**
ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు నాటుసారా తయారీని పూర్తిగా మానుకునే కుటుంబాలకు ప్రభుత్వం తరపున 15,000 ఆర్థిక సహాయం అందించి, కిరాణా దుకాణాలు, కూరగాయల వ్యాపారం, గొర్రెల పెంపకం లేదా బర్రెల పెంపకం వంటి స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి: సారా తయారీ కుటుంబాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు డీఆర్డీఏ ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైవింగ్, టైలరింగ్, కంప్యూటర్స్ వంటి కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పిల్లల చదువులకు భరోసా: ఈ కుటుంబాలలోని పిల్లల భవిష్యత్తు కోసం గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పించి, వారి ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు మెటీరియల్స్ అందించి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆరోగ్యం మరియు సంక్షేమం: నాటుసారా మహమ్మారి వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

**-నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షుడు అభిరుచి మధు.**

**-ఆళ్లగడ్డలో 'అమ్మ పేరుతో చెట్టు' కార్యక్రమం. -బీజేపీలో పలువురు చేరిక.**







**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూన్ 06:**
కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు.
శనివారం ఆళ్ళగడ్డ పట్టణంలో 'అమ్మ పేరుతో చెట్టు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం మండలాల పదాధికారులు, మండల అధ్యక్షులు, ఇంచార్జిల సమక్షంలో సీనియర్ నాయకులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో, చేపట్టాల్సిన వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణ, మార్గదర్శకాలపై ఈ సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీలోకి భారీగా చేరికలు:లి
ఈ సమావేశం సందర్భంగా ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి చంద్రసేన ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. మోదీ ప్రభుత్వ ప్రజాసంక్షేమ పాలనకు ఆకర్షితులై పలువురు బీజేపీ



వైపు చూస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ పట్టణ, రూరల్, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, రుద్రవరం, సిరివెళ్ల మండలాల అధ్యక్షులు, మండల ఇంచార్జిలతో పాటు సీనియర్ నాయకులు లింగన్న, మనుప్రియ రెడ్డి, భగవాన్, స్వాతి మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నవజాత శిశువుల ఆరోగ్యం గుర్తింపు

**శిశుమాపన్ యాప్‌ను ప్రారంభించిన ప్రభుత్వం**

**ఎఐతో అనుసంధానించినట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడి**




**అమరావతి,జూన్6ఆంధ్ర ప్రగతి** నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాలను సులభంగా, ఖచ్చితంగా గుర్తించేందుకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ఆధారంగా పనిచేసే 'శిశు మాపన్' యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ నూతన విధానం ద్వారా పుట్టిన పిల్లలను చేతులతో తాకాల్సిన అవసరం లేకుండానే.. కేవలం మొబైల్ వీడియో ద్వారా వారి ఆరోగ్య వివరాలను రికార్డు చేయవచ్చు. సాధారణంగా నవజాత శిశువుల బరువు, ఎత్తు, తల, ఛాతీ చుట్టుకొలతలను సాంప్రదాయ పద్ధతుల్లో కొలవడం కొంత శ్రమతో కూడుకున్న పని. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు గాను.. ప్రస్తుతం వినియోగంలో ఉన్న 'ఆశా' యాప్‌తో ఈ 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించారు. ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను మంగళగిరి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లకు ఈ యాప్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కూడా పూర్తి చేశారు. మంగళగిరిలో సాధించే ఫలితాలు, క్షేత్రస్థాయి అనుభవాలను పరిశీలించిన అనంతరం ఈ అధునాతన ఏఐ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.